# యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ – ఎడ్యుకేషన్

సైనా జైస్వాల్‌కు

చిన్నారి బాలికలకు రోల్ మోడల్ సైనా జైస్వాల్ ఆటల్లోనే కాదు, పాటల్లోనే కాదు, చదువులోనూ సైనా టాప్. బుడి బుడి నడకల రోజుల్లోనే భగవద్గీతను ఔపోశన పట్టిన నేర్పరి. ఏడేళ్ల వయసులో ఆమె రామాయణ శ్లోకాలను గడగడా చదివేది. ఏడేళ్ల వయసులో ఆమె గానం చేసిన రామాయణ శ్లోకాలను సిడి రూపంలో విడుదల చేశారు కూడా.

లాయర్ అశ్వని కుమార్ జైస్వాల్, భాగ్యలక్ష్మి జైస్వాల్ దంపతుల గారాల పట్టి  అయిన సైనా జైస్వాల్ ప్రతిభను బాల్యంలోనే గుర్తించి ప్రోత్సహించారు. ఆమె గాయనే కాదు,  సంగీతంలో దిట్ట. పియానోను చక్కగా వాయించగలదు.

8  ఏళ్ల వయసులో పదో తరగతి పాసైన తొలి ఆసియా బాలికగా సైనా జైస్వాల్ రికార్డు నెలకొల్పారు. పదేళ్ల వయసులో ఇంటర్మీడియట్ పాసయ్యారు. 13 ఏళ్ల వయసులో హైదరాబాద్‌లోని సెయింట్ మేరీస్ కాలేజీలో మాస్ కమ్యునికేషన్, జర్నలిజం డిగ్రీ చేసింది. 14 ఏళ్ల వయసులో ఆమె ఇప్పుడు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తోంది.

రెండు చేతుల్తో బాణాలు సంధించే అర్జునుడిని సవ్యసాచి అంటారు. అలాగే సైనా జైస్వాల్ సైతం రెండు చేతుల్తో వేగంగా రాయగల దిట్ట. సిజడ్‌టును ఆపరేట్ చేస్తుంది. కోరల్ డ్రా వేస్తుంది. సెకనుకు 2.72 వేగంతో టైపింగ్ చేయగలదు. ఇంకా కిచెన్‌లో అడుగు పెడితే నలభీములను మరిపించే నేర్పరి సైనా జైస్వాల్. కేవలం 25 నిమిషాల్లో హైదరాబాదీ బిర్యానీని  వండిపెట్టగల నేర్పరి.

ఆటల్లో ఆమె అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రైజులు గెలుచుకున్నారు. టేబుల్ టెన్నిస్‌లో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి, ఆసియా స్థాయిలో అనేక కప్పులను సైనా గెలిచారు. ఇంకా 2011 లో వర్ల్డ్ టేబుల్ టెన్నిస్‌కు భారత

దేశం నుండి ప్రాతినిధ్యం వహించిన తొలి బాలికగా ఘనతి కెక్కారు. ఆస్ట్రేలియాలో జరిగిన వల్డ్ టిటి పోటీల్లో 6 వ స్థానం సాధించారు సైనా. జాతీయ స్థాయిలో హ్యాట్రిక్ సాధించిన ఏకైక భారత నారిగా సైనా జైస్వాల్ క్రెడిట్ దక్కించుకున్నారు.

ఆట పాటలతో పాటు కళల్లో నేర్పరిగా అందరినీ ఆశ్చర్య పరుస్తున్న ప్రతిభా శాలి సైనా జైస్వాల్‌కు'సాక్షి' ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా 'సాక్షి' ఫ్యామిలీ తరపున ఇవే అభినందనలు. కంగ్రాట్స్ సైనా.